క్లుప్తంగా

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మనుబోలు-చెర్లోపల్లి మార్గంలోని భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో శనివారం విశేషాభిషేకాలు, పూజలు చేశారు. వెంకయ్యస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

గూడూరురూరల్: మండలంలోని దివిపాళెం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటిలో ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. కోట మండలం ఊసుగుంటపాళెం గ్రామానికి చెందిన గుత్తి సుధీర్(20) గూడూరులో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే వివాహం కావడంతో ప్రస్తుతం చిల్లకూరులో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. వెంటనే సుధీర్‌ను వెలికి తీసిన మిత్రులు సమీపంలోని చిల్లకూరు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించినట్లు వెల్లడించారు.

రాజమన్నార్‌గా రంగనాథుడు



నెల్లూరు(బృందావనం): పగల్‌పత్తు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారు రాజమన్నార్‌గా శనివారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మొగిలి నంబెరుమాళ్‌శెట్టి, మొగిలి రాధాకృష్ణయ్యశెట్టి కుమారులు వ్యవహరించారు.

శ్రీరామపట్టాభిషేక అలంకారంలో వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు శ్రీరామపట్టాభిషేక అవతారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పేటేటి వెంకటసుదర్శన నిఖిలేష్ వ్యవహరించారు.

గోదాదేవికి విశేష పూజలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గల గోదాదేవి సన్నిధి వద్ద ధనుర్మాస దీపారాధన, విశేష పూజలను శనివారం నిర్వహించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లూరు రూరల్: ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని గుర్రం జాషువా గ్రంథాలయంలో అసోసియేషన్ జిల్లా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మందా బాబ్జీ, ఉపాధ్యక్షులుగా కొమ్మల కృష్ణయ్య, శేషం ప్రభాకర్, రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా హరిబాబు, పాలకీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా జూపూడి ప్రశాంత్ నియమితులయ్యారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరులో రైతులకు వరి విత్తనాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వరి నారుమడులు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేస్తోందని తెలిపారు. తుఫాన్ బాధిత రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏఓ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

రైతులకు పంటల సాగుపై అవగాహన

గ్రామీణ కృషి వ్యవసాయ అనుభవం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు జగదేవిపేటలో రైతులకు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం పద్ధతులపై రంగుల పటం ద్వారా శనివారం అవగాహన కల్పించారు. జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎల్ శివజ్యోతి, విస్తరణ విభాగ శాస్త్రవేత్త ఎస్ లోకేష్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరై రైతులకు సాగుకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఎస్ నవీన్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలి

పొదలకూరు : గర్భిణులు ప్రతినెలా 9వ తేదీ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రిషిత సూచించారు. స్థానిక బిట్-1 సచివాలయంలో ప్రధానమంత్రి మాతృత్వవందన యోజనపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం తొలి కాన్పు అయితే రూ.5 వేలు అందజేస్తుందని తెలిపారు. గర్భం దాల్చిన తర్వాత రూ.1000, ఆరో నెలలో రూ.2 వేలు, శిశువు జన్మించిన తర్వాత రూ.2 వేలు వంతున అందజేస్తారని వివరించారు. రెండో కాన్పులో ఆడ శిశువుకు జన్మనిస్తే వ్యాక్సినేషన్ పూర్తయిన తర్వాత రూ.6 వేలు అందజేస్తారని తెలిపారు. ప్రభుత్వ సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, సెక్రటరీ బాలకృష్ణయ్య, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రిషిత

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



కోవూరు: స్థానిక గాంధీపార్కు సెంటర్‌లోని కోదండ రామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. మార్గశిర మాసం నవమిని పురస్కరించుకుని అర్చకులు శ్రీకాంతాచార్యులు, నాగరాజాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయంలో పునర్నిర్మాణ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ఉదయం సీతారాములకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సీడీసీ మాజీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, ఆలయ ఈఓ దగ్గయ్య, గాదిరాజు సుధాకర్, మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

మనుబోలు: వివిధ కారణాలతో ఆర్థికంగా చితికిపోయి కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న మనుబోలుకు చెందిన మూడు కుటుంబాలకు శ్రీసేవానాథం ట్రస్ట్ సభ్యులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని కిడ్నీ వ్యాధిగ్రస్తుడు వేణుంబాక శంకర్‌రెడ్డి, రైలు ప్రమాదంలో భర్తను కోల్పోయిన సంపూర్ణమ్మకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇటీవల గుండెపోటుతో చనిపోయిన మహేష్ కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.



సంపూర్ణమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ముత్తుకూరు: కాలుష్య నియంత్రణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని అదాని కృష్ణపట్నంపోర్టు సీఓఓ సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం కృష్ణపట్నం పోర్టులోని పరిపాలన భవనంలోని ఉద్యోగులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడమే ఏకైక మార్గమన్నారు. పోర్టులో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. మొక్కల పెంపకం ఒక ఉద్యమంలా జరగాలని ఆకాంక్షించారు. అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, గంగాసతీష్, సీహెచ్ శ్రీనివాసులు, సెక్యూరిటీ డీజీఎం మనోహరబాబు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సీఓఓ సంజయ్

ప్రభుత్వ నగదు సాయం పంపిణీ



గిరిజనులకు నగదు సాయం అందజేస్తున్న గోపినాథ్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌లో..

మనుబోలు: మండలంలోని పిడూరుపాళెం గిరిజన కాలనీలో మిచాంగ్ తుఫాన్‌తో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వ నగదు పరిహారాన్ని శనివారం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.2500 వంతున నగదును వైఎస్సార్ సీపీ నేతలు గోపినాథ్‌రెడ్డి, జయశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని ఇస్కపాళెంలోని తుఫాన్ బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన నగదు సాయాన్ని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఇస్కపాళెంలో తుఫాన్ ప్రభావంతో ఏడు ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఒక్కో ఇంటికి రూ.10వేలు చొప్పున నగదు మంజూరు చేసిందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, నరసింహులు, వీఆర్వో యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి పరామర్శ



వెంకటాచలం: మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరువారిపాళెనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా చెంచయ్య(35) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం గ్రామానికి వెళ్లి చెంచయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ప్రహరీ నిర్మాణ పనులు

పొదలకూరు : స్థానిక ఈద్గా మైదానం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముస్లిం మతపెద్దల విజ్ఞప్తి మేరకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈద్గా చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నారు.

నేడు ఫిషింగ్ జెట్టీ నిర్మాణానికి భూమి పూజ

ముత్తుకూరు: మండలంలోని నేలటూరు పంచాయతీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఉదయం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేలటూరు పట్టపుపాళెం వద్ద ఫిషింగ్ జెట్టీ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేస్తారని చెప్పారు.

రాజేశ్వరికి డాక్టరేట్



వెంకటాచలం: తిరుపతి జిల్లా పుత్తూరు మండలం టీఆర్ కండ్రిగకు చెందిన నన్నూరు రాజేశ్వరికి వీఎస్‌యూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కావలి పీజీ సెంటర్ వాణిజ్య విభాగం అధ్యాపకుడు ఎం చంద్రయ్య పర్యవేక్షణలో 'వ్యవస్థాపకత ద్వారా చిత్తూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ మహిళలు, వారి అభివృద్ధి' అనే అంశంపై రాజేశ్వరి పరిశోధనలు చేసి వీఎస్‌యూకు పరిశోధనా పత్రాన్ని సమర్పించింది. ఈ మేరకు రాజేశ్వరికి వీఎస్‌యూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

విద్యార్థులకు రక్త పరీక్షలు



ఇందుకూరుపేట: మండలంలోని నిడిముసలి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి రక్త గ్రూపు కార్డులు అందజేశారు. హెచ్‌ఎం మంజుల, రెడ్‌క్రాస్ ప్రతినిధి అజయ్‌బాబు, మోటివేటర్ భాస్కర్‌రావు, ఎస్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'కోన'లో తిరుప్పావై

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ధనుర్మాసం సందర్భంగా శ్రీవారికి సుప్రభాతం బదులు తిరుప్పావై పఠనం చేపట్టనున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనవరి 14వ తేదీ వరకు తిరుప్పావై ఉంటుందన్నారు. ఆదిలక్ష్మీదేవి ఆలయం వెలుపల 100 మొక్కలు నాటినట్లు వెల్లడించారు.

టీడీపీ నాయకులు డ్రామాలు మానుకోవాలి



మాట్లాడుతున్న గొల్లపల్లి

కోవూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నట్లుగా డ్రామాలు ఆడడం మానుకోవాలని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ టీడీపీ నాయకులకు హితవుపలికారు. ఇందుకూరుపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లికి చెందిన గుమ్మా సుధాకర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్ అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేయడంతో పార్టీ అధిష్ఠానం ఆయన్ని సస్పెండ్ చేసిందని తెలిపారు. కోవూరు మండలం వేగూరు సర్పంచ్ కరేటి అమరావతి వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిపై పోటీ చేసి 5 ఓట్ల తేడాతో గెలుపొందిందని చెప్పారు. ఆమె గెలిచినప్పటి నుంచి టీడీపీ నాయకులతోనే కలిసిమెలసి తిరుగుతోందన్నారు. విడవలూరు మండలం దంపూరుకు చెందిన చేవూరు రాంప్రసాద్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడంతో అధిష్ఠానం సస్పెండ్ చేసిందని తెలిపారు. మనీస్కీం పేరుతో అమాయక ప్రజల నుంచి దాదాపు రూ.40 లక్షల వరకు వసూలు చేసుకుని పారిపోయిన చరిత్ర రాంప్రసాద్‌ది అని ఆరోపించారు. ఆయన చేసే అక్రమాలను తెలుసుకుని పార్టీ దూరం పెట్టడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా, నష్టాన్ని చేకూర్చే విధంగా పనిచేసిన వారిని పార్టీ అధిష్ఠానం దూరంగా ఉంచిందన్నారు. అటువంటి వారంతా టీడీపీతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారన్నారు. అలాంటి వారంతా కోవూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరినట్లుగా డ్రామా నడిపి పచ్చ పత్రికలో పెద్దపెద్ద అక్షరాలతో రాయడం సిగ్గుచేటు అన్నారు. తమ పార్టీలో నిజాయతీగా పనిచేసే వారికి సముచిత స్థానం కల్పించేందుకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎల్లవేళలా ముందుంటారని పేర్కొన్నారు.

అభిమానుల కోరిక నెరవేరింది

పొదలకూరు : కాకాణి రమణారెడ్డి విగ్రహ ఏర్పాటుతో ఆయన అభిమానుల చిరకాల కోరిక నెరవేరిందని వైస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సంగంరోడ్డు సర్కిల్లో మాజీ సమితి అధ్యక్షుడు కాకాణి రమణారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆయన అభిమానులు ముందుకు రాగా కొందరు న్యాయపరమైన చిక్కులు కల్పించడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రెండ్రోజుల్లో సంగంరోడ్డు సర్కిల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శనివారం రమణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ, సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ మళ్లీ కొందరు న్యాయపరమైన చిక్కులు కల్పించేందుకు ప్రయతిన్నస్తున్నట్టు తెలిపారు. మండలమే కాక చుట్టుపక్కల మండలాల్లో కాకాణి రమణారెడ్డికు పార్టీలకు అతీతంగా అభిమానులు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోనం చినబ్రహ్మయ్య, వళ్లూరు గోపాల్‌రెడ్డి, పలుకూరు పోలిరెడ్డి, మండలపార్టీ కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, డీ విజయభాస్కర్‌రెడ్డి, వెంపులూరు శ్రీనివాసులుగౌడ్, పుచ్చా చెంచుకృష్ణారెడ్డి, పెదమల్లు శ్రీనివాసులురెడ్డి, లక్కాకుల ఆనంద్‌రావు పాల్గొన్నారు.



రమణారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దిగజారిన నిమ్మ ధరలు

పొదలకూరు: చలి ప్రభావంతో నిమ్మ కాయలు ధరలు మరింత దిగజారాయి. ప్రస్తుతం పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులో కిలో రూ.15 నుంచి రూ.20 మాత్రమే ధర పలుకుతున్నాయి. ఉత్తర భారత దేశంలో చలితీవ్రత పెరగడం, అన్ని ప్రాంతాల నుంచి కాయలు ఎగుమతి అవుతుండడంతో నిమ్మ రైతులకు కష్ట కాలం ఏర్పడింది. దక్షిణ భారత దేశంలోని తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం కాయలకు డిమాండ్ లేకుండా పోయింది. మండలంలో 9 వేల ఎకరాల్లో నిమ్మ తోటలు సాగుచేస్తున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో వీచిన పెనుగాలులకు నిమ్మతోటలకు అపార నష్టం వాటిల్లింది. దీంతో తోటల్లో కాయలు ఆశించిన స్థాయిలో లేవు. కాయల దిగుబడి లేకున్నా మార్కెట్లో ధరలు పెరగడం లేదు. చిన్న, సన్నకారు రైతులైతే భార్య, భర్త కలిసి సొంతంగా తోటల్లో కాయలను కోసుకుని మార్కెట్‌కు తీసుకుని వెళితే ఖర్చులు పోనూ రూ.100 నుంచి రూ.150 బస్తాకు మిగిలే అవకాశం ఉంది. కూలీలను ఏర్పాటు చేసి కాయలు కోయిస్తే ఆటోల బాడుగలు, కూలీల ఖర్చులు పోను ఏమీ మిగిలే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఆడుదాం ఆంధ్రాకు 320 మంది రిజిస్ట్రేషన్

కోవూరు: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి 320 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. శనివారం ఆయన ఆడుదాం ఆంధ్రా పోటీలపై ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణయ్య, ఎంఈఓలతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించి 9 క్రీడా మైదానాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి మైదానానికి గ్రౌండ్ ఇన్‌చార్జిగా మండల స్థాయి అధికారులను నియమించినట్లు చెప్పారు. గ్రౌండ్ ఇన్‌చార్జులు సంబంధిత సచివాలయ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని పోటీలను స్నేహపూరిత వాతావరణంలో నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట

తోటపల్లిగూడూరు: పాడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పొట్లపూడి, కొత్తపాళెం గ్రామాలకు చెందిన 134 మంది రైతులకు ఉచిత పశుదాణామృతాన్ని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే మిచాంగ్ తుఫాన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాడి రైతులకు ఉచితంగా పశుదాణామృతాన్ని పంపిణీ చేస్తోందని తెలిపారు. కోడూరు పశువైద్యశాల వైద్యులు నరేష్, పాడి రైతులు పాల్గొన్నారు.



పొట్లపూడిలో మాట్లాడుతున్న చిల్లకూరు సుధీర్‌రెడ్డి

వేడుకగా యునైటెడ్ సింహపురి క్యారల్స్





నెల్లూరు(బృందావనం): నగరంలో యునైటెడ్ సింహపురి క్యారల్స్‌ను శనివారం వేడుకగా నిర్వహించారు. ఏబీఎం కాంపౌండ్ వద్ద ఫాదర్ జోసఫ్, బాప్టిస్ట్ చర్చి డానీహాల్ పాస్టర్ రెవరెండ్ శ్యామ్‌సన్ కుమార్, బ్రదర్ బర్నబాస్, బ్రదర్ పాల్‌కోటి, రెవరెండ్ డాక్టర్ మణిరావ్, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్ క్యాండిల్ వెలిగించి.. బెలూన్లను వదిలి క్యారల్స్‌ను ప్రారంభించారు. యేసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే భక్తిగీతాలను ఆలపిస్తూ ఏబీఎం కాంపౌండ్ నుంచి బట్వాడిపాళెం వరకు సాగింది. వీఆర్సీ సెంటర్ వద్ద భారీ కేక్‌ను కట్ చేశారు. గాయక బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ చైర్మన్ అరుణ్‌కుమార్, కన్వీనర్లు రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ జానిజో, కో కన్వీనర్లు విద్యాధర్, మహేష్, సాయి, ప్రముఖ న్యాయవాది శివరామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా క్యారల్స్

నెల్లూరు(క్రైమ్): గౌతమినగర్‌లోని యునైటెడ్ క్రిస్టియన్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ క్యారల్స్‌ను వేడుకగా శనివారం నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ షారోన్ ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని సంఘ సభ్యుల గృహాలను సందర్శించి క్రీస్తు జనన వృత్తాన్ని వివరించే భక్తిగీతాలను సంఘపెద్దలు, యువత ఆలపించారు. క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. సంఘ అధ్యక్షుడు జయప్రసాద్, సెక్రటరీ విలియమ్ జోసఫ్, జాయింట్ సెక్రటరీ వినోద్‌కుమార్, సంఘ పెద్ద దేవదానం పాల్గొన్నారు.